క్లుప్తంగా

డ్రమ్ములను సద్వినియోగం చేసుకోవాలి



డ్రమ్ములను పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సూర్యనారాయణ

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకంగా ఎస్సీ రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న డ్రమ్ములతోపాటు నవధాన్యాల కిట్లు, టార్పాలిన్లను వినియోగించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని లబ్బ, సిరువాడ, మాతల గ్రామాలకు చెందిన 31 మంది రైతులకు లబ్బ గ్రామంలో శనివారం ఎస్సీ రైతులకు డ్రమ్ములను పంపిణీ చేశారు. నవధాన్యాల కిట్లను వినియోగించుకుని పొలాలను సారవంతంగా చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతం, నీమాస్త్రంతోపాటు పలు రకాల కషాయాలు తయారీ కోసం ప్రభుత్వం డ్రమ్ములు పంపిణీ చేసిందన్నారు. సర్పంచ్‌లు తులసీ, ధర్మారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

బూర్జ: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐ.పావని అన్నారు. మండలంలోని డొంకలపర్తలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామంలోని ప్రధాన వీధిలో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రధాన వీధికి రహదారి లేకపోవడంతో వర్షం పడితే బురదలో నడవాల్సి వచ్చేది. పంచాయతీ, మండల పరిషత్ నుంచి నిధులతో మురుగు నీటి కాలువ, రహదారి ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు తెలిపారు.

208 మందికి కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష-2, కంటి వెలుగులో భాగంగా కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ చేయించుకున్న 208 మందికి కళ్లద్దాలను స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య ఆయా వెలనెస్ సెంటర్లకు పంపిణీ చేశారు. కొత్తూరు మండలంలోని దిమిలి, పొనుటూరు, పారాపురం, కొత్తూర-1, సోమరాజపురం, మెట్టూరు బిట్-1 గ్రామ సచివాలయాల్లో 103 మందికి, హిరమండలం మండలంలో 44 మందికి, ఎల్.ఎన్.పేట మండలంలో 63 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

15న మహాజన సభ

పోలాకి: మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఆవరణలో ఈ నెల 15వ తేదీన మహాజన సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఈఓ రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆఖరి సమావేశానికి రైతులందరూ హాజరుకావాలని కోరారు.

12న మండల సమావేశం

పోలాకి: ఈ నెల 12వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఉషశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ముద్దాడ దమయంతి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్

- చంద్రబాబు మోసం చేస్తే.. సీఎం జగన్ మేలు చేశారు..
- చేయూత సభలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: మహిళల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇచ్చి, అన్ని సంక్షేమ పథకాలు వారి పేరుమీద ఇచ్చిన నాయకుడని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చల్లవానిపేట సభలో మహిళలకు చేయూత మొత్తం రూ.9.76 కోట్లు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు 2014లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశాడన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారం కోసం మీ ముందుకు టీడీపీ నాయకులు, చంద్రబాబు మాయ మాటలు చెప్పేందుకు వస్తారని, వాటిని నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. ప్రతీ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయమని సీఎం జగన్ చెబుతున్నారని, ఇప్పటివరకు ఇలా చెప్పిన దమ్మున్న నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది సీఎం జగన్ ఒక్కరేనని అన్నారు. సీఎం జగన్‌ను చంద్రబాబు ఎదిరించలేకే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకొని నీతిమాలిన రాజకీయాలు చెస్తున్నారని విమర్శించారు. శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. సీఎం జగన్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌కే మీరంతా అండగా నిలవాలని కోరారు. బీసీ జోనల్ ఇన్‌చార్జ్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ డోల నాగరత్నం, చల్లవానిపేట, అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, పార్టీ మండల కన్వీనర్ కనుసు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠలరావు, వ్యవసాయ మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, దామ మన్మధరావు, పి.విజయ్, వెలమల అసిరినాయుడు, పి.తవిటినాయుడు, సర్పంచ్‌లు మెండ రవి కుమార్, మెండ కృష్ణ, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రానున్న ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబుకు ప్రజలు నమ్మి ఓట్లేసి మోసపోయారని గుర్తుచేశారు. ఇందులో ఆరు హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. మరోసారి మోసం చేసేందుకు బాబుతోపాటు మొత్తం బ్యాచ్ ప్రజల వద్దకు ప్రతీరోజు వస్తున్నారన్నారు. ప్రజలకు ఏం చేశారని ఓట్లు అడుగుతున్నారో గ్రామాలకు వచ్చే టీడీపీ నాయకులను నిలదీయాలన్నారు. 2014లో పాతపట్నం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచిన కలమట వెంకటరమణ రెండేళ్లల్లోనే పార్టీ ఫిరాయించారని, ఆయనను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన కలమటకు 2019 ఎన్నికల్లో పాతపట్నం ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, 2024 ఎన్నికల్లోనూ మరోసారి బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. అన్ని వర్గాల వారి సంక్షేమాన్ని, ఆర్థిక అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే సీఎం జగనన్నకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. కరోనా మహమ్మారి విరుచుకుపడిన సమయంలోనూ ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగించిన జగన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రతీ ఇంటికి వంశధార తాగునీరు అందివ్వాలనే ఆశయంతో జగనన్న రూ.265 కోట్లు నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు. జగనన్న ఆశీర్వాదంతో పాతపట్నం నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత మహార్తాపురం



విన్నర్, రన్నర్ జట్లతో ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీ మైదానంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మండలంలోని మహార్తాపురం గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు విన్నర్‌గా, నివగాం జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఈ నెల 10 తేదీన లబ్బ గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరంలో జిల్లా ఎస్పీ చేతులు మీదుగా ట్రోఫీలు అందజేస్తామని ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ చెప్పారు. టోర్నమెంట్‌లో 11 జట్లు పాల్గొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



జలుమూరు: పూజలు చేస్తున్న భక్తులు



హిరమండలం: ఉమారుద్ర కోటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కొత్తూరు: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పొందూరు: బాలయోగి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి పడియా కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు పూజలు చేసారు. శివరాత్రి జాగరణం చేసిన శివ భక్తులు వేకువ జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అధికంగా సాలగ్రామ దానాలు, స్వామివారికి అర్చనలు, దర్శనాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవం

సారవకోట: మండలంలోని అవలింగి మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు. మహా శివరాత్రి మరోసటి రోజు అర్ధ రాత్రి మహాలింగాన్ని విభూదితో అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు చిన్న స్వామి తెలిపారు.

శివపార్వతుల కల్యాణం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ ఆర్ కాలనీలో ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు దంపతులు నిర్వహించారు. ఆర్ఆర్ కాలనీకి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

చిన్నకోరాడలో..

హిరమండలం: చిన్నకోరాడలో గల ఉమారుద్ర కోటేశ్వర ఆలయలంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉమా సహిత కోటేశ్వర స్వామివారి తిరువీధి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

నందివాడలో..

పొందూరు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నందివాడలోని ఆశ్రమంలో బాలయోగిని శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా శివరాత్రి, తరువాత రోజున మాత్రమే బాలయోగి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయం ఆవరణలో అమ్మవార్లకు, శివలింగానికి పూజలు చేశారు. విశాఖపట్నం బాలయోగి ట్రస్టు ప్రతినిధులు ఆధ్వర్యంలో వందలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. కింతలి, తాడివలస పిహెచ్‌సిల సిబ్బంది ఆరోగ్య సేవలు అందించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



సినీ గీతాలకు నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సందడి చేశారు. పలు సినీ గేయాలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్.సునీత, ఉపాధ్యాయులు పి.మురళీకృష్ణ, జె.నరేంద్ర, కోరాడ లక్ష్మణరావు, ఎస్.సంధ్యారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గ్రామాల్లో నిర్మాణం చేపడుతున్న రోడ్లు అభివృద్ధికి మరింత దోహదం చేస్తాయని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కొమనాపల్లి వైఎస్సార్ జంక్షన్ వద్ద లుకులాం-కొమనాపల్లి అర్అండ్‌బీ రోడ్డుకు రూ.1.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జోనల్ ఇన్‌చార్జ్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



హిరమండలం: మాట్లాడుతున్న డీపీఎల్‌ఓ వెంకటరమణ

పాతపట్నం: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిల వసూలును వేగవంతం చేయాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ కార్యదర్శులకు ఆదేశించారు. పాతపట్నం మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ పన్నుల వసూల రికార్డులను పరిశీలించారు. పాతపట్నం పంచాయితీకి సంబంధించి ఈ నెలాఖరులోగా రూ.1,52,02,602 వసూలు చేయాల్సి ఉన్నా.. ఇప్పటివరకు రూ.56,35,737 వసూలు చేశారన్నారు. గుమస్తా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని టెక్కలి డీఎల్‌పీఓ ఇప్పిలి వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయలంలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్ను వసూలు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. హిరమండలం మేజర్‌పంచాయతీ ఈఓ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



పాతపట్నంలో చెక్కులు పంపిణీ చేస్తున్న మామిడి శ్రీకాంత్



చెక్కు అందజేస్తున్న రెడ్డి శ్రావణ్, నాయకులు

పాతపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద రూ.5.40 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సిఫార్స్ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ చెక్కులను పంపించారు. పాతపట్నం మండలానికి చెందిన రమేష్ సాహు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని భార్య భూదేవి సాహుకి రూ.4 లక్షల చెక్, పెద్దలోగిడికి చెందిన కె.లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఈయనకు రూ.లక్ష చెక్, తిడ్డిమి గ్రామానికి చెందిన తామరాపల్లి మానస అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈమెకు రూ.40 వేల చెక్కును శ్రీకాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, పార్టీ నాయకులు డకర చిన్నారావు, పాడి అప్పారావు, గణపతి ప్రధాన్, నాగరాజు, తిరుమలరావు, ఈశ్వరరావు, డోల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు..

గ్రామీణ ప్రాంతాల్లో హిందూ దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని మామిడి శ్రీకాంత్ తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న 25 దేవాలయాల అభివృద్ధి, నిర్మాణం కోసం ఈ నిధులు ఖర్చుచేస్తామన్నారు. మెళియాపుట్టి మండలంలో 16 దేవాలయాలు, పాతపట్నంలో 6, కొత్తూరులో 2, హిరమండలంలో ఒకటి దేవాలయాలు ఉన్నాయన్నారు. ఒక్కొక్క దేవాలయం అభివృద్ధికి టీటీడీ రూ.10 లక్షల నిధులు విడుదల చేసిందన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండలంలోని పెద్దలొగిడి గ్రామానికి చెందిన కె.లక్ష్మణరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.లక్ష చెక్ మంజూరైంది. లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. చెక్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి శ్రావణ్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు తదితరులు పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం అందజేశారు.

ఎమ్మెల్యే రెడ్డి శాంతి సహకారంతో చెక్ మంజూరైందన్నారు. ఏఎంసీ అధ్యక్షుడు కె.అర్జునుడు, పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, మండల ప్రత్యేకాహ్వానితుడు ఎం.గణపతిరావు, సర్పంచ్ డకర చిన్నారావు, బుజ్జిబాబు, కృష్ణమూర్తి, టంకాల సుధ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



ఎల్.ఎన్.పేట: గొట్టిపల్లిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మాజీ ఎంపీపీ సాంబశివరావు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు శనివారం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత జగనన్న పాలనకు ఉన్న తేడా ఏమిటో బేరీజు వేసుకోవాలన్నారు. ఎవరు మేలు చేశారో తెలుసుకోవాలన్నారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఎంతబాగా పరిపాలన చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. టీడీపీ, జనసేన నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

- సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: హిరమండలంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెళియాపుట్టి: ఎర్రమానుగూడలో గిరిజనులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య



పాతపట్నం: బోరుభద్రలో సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావు



కొత్తూరు: బలదలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పార్టీ నాయకులు

జోగన్నపేటలో చలివేంద్రం ప్రారంభం



పొందూరు: జోగన్నపేటలో సూర్యోదయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఆదినారాయణ, పోతయ్య, శివ, చంద్రశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

నేడు చేయూత సంబరాలు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో గల పైడితల్లి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు చేయూత సంబరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త పేడాడ తిలక్ హాజరవుతారన్నారు. మండలంలోని 34 పంచాయతీల నుంచి లబ్ధిదారులందరూ దీంట్లో పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సరుబుజ్జిలి: రానున్న వేసవిలో వ్యాపించనున్న వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. విందులు, ఆరుబయట తినుబండారాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారి సాహితి, సీహెచ్‌ఓ మోహన్‌రావు పాల్గొన్నారు.